RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 59 | మార్చి 17 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| Nizamabad | Vol: 03 | Vol: 59 | March 17 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## కాంగ్రెస్ హామీలపై పోరాటం చేస్తాం కేటీఆర్

2

## భారత్‌కు గ్యాస్ నౌక 'శివాలిక్'

గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరిన షిప్



**అహ్మదాబాద్ జనసంఘర్షణ**
ఖతార్ నుండి బయలుదేరిన భారీ గ్యాస్ నౌక 'శివాలిక్' సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకోవడంతో భారత ఇంధన రంగంలో నెలకొన్న ఆందోళనలు తొలగిపోయాయి. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఇరాన్ మరియు అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ఈ నౌక ప్రయాణించడం విశేషం. ఇరాన్ హెచ్చరికల వల్ల గల్ఫ్ దేశాల నుండి చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న భయాలు ఉన్నప్పటికీ, భారత నావికాదళం

మిగతా 2వ పేజిలో..

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- 2047 నాటికి తెలంగాణ తీర్చిదిద్దడమే..
- విజన్-2047' ద్వారా గ్లోబల్ హబ్‌గా రాష్ట్రం
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి ఒక దిక్సూచిలా నిలిచింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటించిన గవర్నర్, ప్రతి పౌరుడిని ఈ ప్రగతి ప్రస్థానంలో భాగస్వామిని చేసేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతంగా ఉందని, తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. 'విజన్-2047' ద్వారా రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ. 5.72 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని వివరించారు. పరిపాలనా సౌలభ్యం మరియు పట్టణాభివృద్ధి కోసం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్

మిగతా 2వ పేజిలో..

## రాష్ట్రాల్లో గ్యాస్ నిల్వలు

- ఎల్పీజీ సరఫరాను కొనసాగిస్తాం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశంలో వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన విడుదల చేసింది. గృహ వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు వంద శాతం ఎల్పీజీ సరఫరాను కొనసాగిస్తామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తగినంత గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో

మిగతా 2వ పేజిలో..

## కటక్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘోరం

- ఐసీయూలో మంటలు చెలరేగి పెను విషాదం

**కటక్ జనసంఘర్షణ**
ఒడిశాలోని కటక్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ట్రామా కేర్ విభాగం ఐసీయూలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చికిత్స పొందుతున్న పదిమంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించగా, దట్టమైన పొగ మరియు మంటల మధ్య రోగులను కాపాడేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నాలు పాక్షికంగానే ఫలించాయి.

మిగతా 2వ పేజిలో..

## డ్రోన్లతో విరుచుక పడుతున్న ఇరాన్

దుబాయ్‌లో దాడులు



**టెహ్రాన్ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో, ఇరాన్ తన డ్రోన్ దాడులను మరింత ఉధృతం చేసింది. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా ప్రతికార చర్యలకు దిగుతున్న ఇరాన్, తాజాగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో విరుచుకుపడటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో ఒక డ్రోన్ ఇంధన ట్యాంకర్‌ను నేరుగా ఢీకొనడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన దుబాయ్ సివిల్ ఏవియేషన్ అధికారులు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి,

మిగతా 2వ పేజిలో..

## సభ్యులంతా హాజరు కావాల్సిందే..

ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (జూరా) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సభకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని, ఏ ఒక్కరూ గైర్హాజరు కావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సభకు రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు దీటుగా సమాధానం చెప్పేలా పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని, మంత్రులు కూడా ఎమ్మెల్యేలకు తగిన సమయం కేటాయించి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం ప్రభుత్వానికి

మిగతా 2వ పేజిలో..

## 5,500కు పైగా విమాన సర్వీసులు రద్దు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మరియు అమెరికా మధ్య నెలకొన్న భీకర

మిగతా 2వ పేజిలో..

## మార్చి 31వ తేదీ వరకు సమావేశాలు

- మార్చి 17, 18 తేదీలలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశాలు మార్చి 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం, మార్చి 17, 18 తేదీలలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లో చర్చ జరుగుతుంది. అత్యంత కీలకమైన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మార్చి 20న శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మార్చి 23 నుండి 26 వరకు దానిపై సమగ్ర చర్చలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. సమావేశాల ముగింపు రోజైన మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై

మిగతా 2వ పేజిలో..

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** ప్రాంతాన్ని నాలుగు పోలీస్ కమిషనరేట్లుగా విభజించినట్లు గవర్నర్ వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళనతో పాటు రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, వరంగల్ మరియు ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణం వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. ఐటీ రంగంలో రూ. 3.13 లక్షల కోట్ల ఎగుమతులతో తెలంగాణ దూసుకుపోతోందని, సుమారు 9.39 లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. సంక్షేమ రంగంలో భాగంగా 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా చేకూరిన లబ్ధి, రైతు భరోసా మరియు రుణమాఫీ కోసం చేసిన ఖర్చులను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారు. రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాల భర్తీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గవర్నర్ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారంటీల అమలుపై నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనల మధ్యే సాగిన ఈ ప్రసంగం, తెలంగాణను పారిశ్రామికంగా, ఆర్థికంగా అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాత్మక మార్గాన్ని ఆవిష్కరించింది.

## భారత్‌కు గ్యాస్ నౌక 'శివాలిక్'

**మొదటిపేజీ తరువాయి..** కట్టుదిట్టమైన భద్రత మరియు నిఘా నడుమ ఈ రవాణాను విజయవంతంగా పూర్తి చేసింది. ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ తో వచ్చిన ఈ నౌక, ప్రస్తుతం ముంద్రా పోర్టులో అన్-లోడింగ్ ప్రక్రియను జరుపుకుంటోంది. అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు ఈ మార్గంలో ప్రయాణించడానికి వెనుకాడుతున్న సమయంలో కూడా భారత్ తన వ్యూహాత్మక దౌత్య సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగించగలిగింది. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా కలిగిన ఈ కీలక జలసంధిలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, శివాలిక్ రాక దేశీయ ఇంధన భద్రతకు పెద్ద ఊరటనిచ్చింది. ఈ పరిణామం భారత విదేశాంగ మరియు రక్షణ శాఖల సమన్వయానికి నిదర్శనంగా నిలుస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రాష్ట్రాల్లో గ్యాస్‌నిల్వలు

**మొదటిపేజీ తరువాయి..** భారతీయ నౌకలన్నీ సురక్షితంగా ఉన్నాయని కేంద్రం భరోసా ఇచ్చింది. సుమారు 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో ఖతార్ నుండి బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకోవడం ఇంధన భద్రత పరంగా పెద్ద ఊరటనిచ్చింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపివేయడంతో ఇతర రంగాలపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, హాస్టళ్లు తమ మెనూలో కోతలు విధిస్తున్నాయి. పలు ప్రముఖ దేవాలయాలు ప్రసాదాల తయారీని తాత్కాలికంగా ఆపివేయగా, సీఎన్జీ (జచీ+) బంకుల్లో నిల్వలు తగ్గడంతో ఆటోలు, వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. గృహ వినియోగదారులకు సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బుకింగ్ మరియు డెలివరీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు సిలిండర్ల కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. యుద్ధ మేఘాలు మరియు పండుగల రద్దీ వెరసి గ్యాస్ డిమాండ్‌ను అమాంతం పెంచేశాయి.

## కటక్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘోరం

**మొదటిపేజీ తరువాయి..** ఈ క్రమంలో 11 మంది ఆస్పత్రి సిబ్బంది కూడా గాయపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఘటన సమయంలో వార్డులో ఉన్న 23 మంది రోగులలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తరలింపు ప్రక్రియలో ప్రాణాలు విడిచారు. ఈ దుర్ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులను పరామర్శించిన ఆయన, మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశించిన ప్రభుత్వం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ప్రస్తుతం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తుండగా, ఆస్పత్రి ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు మరియు అగ్నిమాపక వ్యవస్థల పనితీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

## సభ్యులంతా హాజరు కావాల్సిందే..

**మొదటిపేజీ తరువాయి..** ఒక రోడ్ మ్యాప్ వంటిదని, ఇందులో పేర్కొన్న లక్ష్యాలే వచ్చే ఎన్నికలకు మన ఎజెండా అవుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాల గురించి చర్చించే దశ దాటిపోయిందని, ఇకపై ప్రభుత్వం ప్రజలకు ఏం చేయబోతోందనే భవిష్యత్తు ప్రణాళికలపైనే దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. గతంలో విపక్ష నేతలకు మైక్ ఇవ్వకుండా, తనను సభ నుంచి సస్పెండ్ చేసి ఇబ్బందులు పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో చర్చ పక్కదారి పట్టకుండా సమర్థవంతంగా సాగాలని కోరారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు చర్చల్లో క్రియాశీలంగా పాల్గొనాలని, తాగునీటి సమస్యలు మరియు 99 రోజుల ప్రగతి ప్రణాళికను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## మార్చి 31వ తేదీ వరకు సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..** చర్చ జరగనుంది. ఈ మధ్యలో వచ్చే ఉగాది, రంజాన్ మరియు శ్రీరామనవమి పండుగల దృష్ట్యా అసెంబ్లీకి సెలవులు ప్రకటించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు హరీశ్ రావు మహేశ్వర్ రెడ్డి అక్బరుద్దీన్ ఓవైసీ మరియు కూనంనేని సాంబశివరావు పాల్గొని సభ సజావుగా సాగేందుకు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## 5,500కు పైగా విమాన సర్వీసులు రద్దు

**మొదటిపేజీ తరువాయి..** దాడులు, ప్రతిదాడుల ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఈ ఉద్రిక్తతల కారణంగా భారత్ నుంచి ఇప్పటివరకు 5,500కు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో భారతీయ విమానయాన సంస్థలకు చెందిన 4,335 సర్వీసులు ఉండగా, మిగిలిన 1,187 విదేశీ సంస్థలకు చెందినవని ఆయన వివరించారు. గగనతలం మూసివేత కారణంగానే ఈ అంతరాయం ఏర్పడిందని, ప్రయాణికుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో డీజీసీఏ (ణ+జూా) తో కలిసి పౌర విమానయాన శాఖ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందని, అవకాశం ఉన్నప్పుడల్లా ప్రత్యేక సర్వీసుల ద్వారా ఇప్పటివరకు 2.19 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేశామని మంత్రి తెలిపారు. యుద్ధ మేఘాలు తొలగి, గగనతలం తిరిగి అందుబాటులోకి వచ్చినప్పుడే విమానాల రాకపోకలు మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో, గత ఏడాది ఇండిగో విమానాల రద్దుతో ఇబ్బంది పడ్డ ప్రయాణికులకు రూ. 163.92 కోట్ల మేర ట్రావెల్ కూపన్ల రూపంలో పరిహారం అందించామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

## డ్రోన్లతో విరుచుక పడుతున్న ఇరాన్

**మొదటిపేజీ తరువాయి..** అన్ని విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు మరియు సిబ్బంది భద్రత కోసం అత్యవసర నోటీసులు జారీ అయ్యాయి. విమానాశ్రయానికి రావాల్సిన పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. ప్రస్తుతం దుబాయ్ సివిల్ డిఫెన్స్ బృందాలు ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నాయి. ముందస్తు జాగ్రత్తగా స్థానిక ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని అధికారులు ఆదేశించారు. ఈ దాడి నేపథ్యంలో విమానాశ్రయ పరిసరాల్లోని కీలక మౌలిక సదుపాయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**భోజనం కోసం ఆగిన కారుపై దూసుకెళ్లిన కంటెయినర్**

**ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే దుర్మరణం**

**మేడ్చల్, మార్చి16** : రోడ్డు పక్కన భోజనం కోసం కారు ఆపడమే వారి పాలిట శాపమైంది. కంటైనర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఓఆర్ఆర్ పక్కన కారు నిలిపి భోజనం చేస్తున్న సమయంలో వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టడంతో.. కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతులను మౌలాలికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఖాన్ (51), కాప్రా సాకేత్‌కు చెందిన హుస్సేన్ (53)గా గుర్తించారు. మద్యం మత్తులో కంటైనర్ నడిపిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట సమీపంలో ఔటర్ రింగ్ రోడ్ పై జరిగింది. కారు ఆపి భోజనం చేస్తున్న వారిపై ఓ కంటైనర్ వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం, నగరంలోని మౌలాలి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆడి కారులో ప్రయాణిస్తున్నారు. శామీర్‌పేట సమీపంలోని ఓర్ఆర్‌పై వారు కారును ఆపి పక్కనే నిలబడి భోజనం చేస్తున్నారు. ఈ సమయంలో వేగంగా వచ్చిన కంటైనర్ వారిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శామీర్‌పేట పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదానికి అతి వేగమే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం

**గన్‌పార్క్ వద్ద అమరులకు కెటిఆర్ తదితరుల నివాళి**

**హైదరాబాద్,** : ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళు లర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదరుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

## కడియం మహిళ హత్యాచారం కేసు

**నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగారం**

**రాజమండ్రి కోర్టు సంచలన తీర్పు**

**రాజమండ్రి, మార్చి16** : సంచలనం సృష్టించిన తూర్పుగోదావరి జిల్లాలోని కడియం నర్సరీలో మహిళపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో.. కోర్టు కీలక తీర్పు వెలువరించింది .. కడియం మండలంలో జరిగిన నర్సరీ మహిళపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితులైన నలుగురు యువకులకు మరణం వరకూ జీవిత ఖైదు విధిస్తూ రాజమండ్రి కోర్టు తీర్పు వెల్లడించింది. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన 43 ఏళ్ల వివాహిత రౌతు కస్తూరి స్థానిక నర్సరీలో పని చేసేది. 2024 అక్టోబర్ 15న ఆమె నర్సరీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినప్పటికీ ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్‌గా వచ్చింది. దీంతో వారు చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తరువాత అక్టోబర్ 16న కస్తూరి భర్త కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో అక్టోబర్ 17న చొప్పల్ల లాకుల వద్ద కాలువలో కస్తూరి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, నర్సరీలో మద్యం సేవిస్తున్న నలుగురు యువకులు పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న కస్తూరిని అడ్డగించారు. ఆమె కాళ్లు చేతులు కట్టి నర్సరీ మొక్కల మధ్యకు తీసుకెళ్లి సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను హత్య చేసి సమీపంలోని ప్రధాన పంటకాలువలో పడేశారు. అయితే, ఈ కేసులో బుర్రిలంక గ్రామానికి చెందిన దేవర యేసు (21), వెలుబుడి ప్రవీణ్ (21), లోకిన జయప్రసాద్ (19), అలాగే పొట్టిలంక గ్రామానికి చెందిన దాసరి సురేష్ (22) అనే నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అనంతరం పూర్తి దర్యాప్తు చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును ఫాస్ట్ ట్రాక్‌గా విచారించిన రాజమండ్రి నాలుగవ అదనపు జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి నిందితుల నేరం రుజువైన నేపథ్యంలో నలుగురికి మరణం వరకూ జీవిత ఖైదు శిక్ష విధించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ మహిళలపై జరిగే దారుణ నేరాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్‌గా పరిగణించి కేవలం 11 నెలల్లోనే విచారణ పూర్తి చేశామని చెప్పారు. మొత్తం 14 నెలల్లోనే నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి నిందితులపై ఉన్న ఆధారాలు, పోలీసుల దర్యాప్తు నివేదికలను పరిశీలించిన అనంతరం ఈ సంచలన తీర్పును ప్రకటించారు. నిందితులు అందరూ 19 ఏళ్ల నుంచి 26 సంవత్సరాల మధ్య యువకులని పోలీసులు తెలిపారు. మహిళ ప్రతిరోజు మాదిరిగానే నర్సరీ పనులకు వెళ్లిన సమయంలో నిందితులు ఆమెపై దాడి చేసి గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. అనంతరం తమ నేరాన్ని దాచేందుకు ఆమెను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మహిళల భద్రతపై కూడా పెద్ద చర్చ జరిగింది. ఈ ఘటనపై మీడియాతో మాట్లాడిన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ కేసు వివరాలను వెల్లడించారు. బాధిత మహిళ అక్టోబర్ 15వ తేదీన కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. బాధిత మహిళ చివరిసారిగా ఎక్కడ కనిపించిందో, ఎవరిని కలిసిందనే వివరాలను సేకరించామని అన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ కేసును ముమ్మరంగా దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఇటీవల రాజమండ్రి జిల్లాలో పోక్సో కేసులు తగ్గాయని తెలిపారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ పెంచడం వల్ల ఈ కేసులు తగ్గుతున్నాయని వివరించారు

# మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- జిల్లాలో పెద్దఎత్తున మక్కదిగుబడి..
- నష్టపోతున్న రైతులు..
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



బోధన్ : మార్చి 16 జన సంఘర్షణ

నిజామాబాద్ జిల్లాలో రైతులు పండించిన మక్కపంటకు సంబంధించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి కి ఆయన లేఖ రాశారు. జిల్లాలో ఈ ఏడాది పెద్ద ఎత్తున మక్క సాగు జరిగిందని ఎంపీ అన్నారు. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర (మీూ) రూ.2,400 ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1,700 నుంచి రూ.1,800 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్కువ ధరకు అమ్ముకోవడం వల్ల ప్రతి రైతు సగటున రూ.20,000 నుండి రూ.25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. అలాగే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, మక్క కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.

# రేపు తెలంగాణ యూనివర్సిటీలో మెగా ఉద్యోగ మేళా




బోధన్ : మార్చి 16 జన సంఘర్షణ

రేపు తెలంగాణ యూనివర్సిటీలో మెగా ఉద్యోగ మేళా-యువత పెద్ద సంఖ్యలో పాల్గోనాలి. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రేపు (మార్చి 17, 2026) విశ్వవిద్యాలయం డిచ్‌పల్లి క్యాంపస్‌లో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్లేస్మెంట్ డైరెక్టర్ సెల్ డాక్టర్ పాత నాగరాజు తెలిపారు. విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొంటున్నారు .వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు మాట్లాడుతూ యువత తమ విద్యకు అనుగుణంగా మంచి ఉద్యోగాలను పొందేందుకు ఇటువంటి ఉద్యోగ మేళాలు ఉపయోగపడతాయని తెలిపారు. విశ్వవిద్యాలయం తరఫున యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఇతర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ ఈ ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని తెలిపారు. యువత తమ అర్హతలకు అనుగుణంగా వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉందన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా. పాత నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ రిస్యూమే, బయోడేటా, ఆధార్ కార్డు తీసుకుని ఉదయం 9 గంటల నుండి క్యాంపస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఉద్యోగ మేళ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ మరియు సంయుక్తంగా ఈ జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లాలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఉద్యోగాలను పొందాలని విశ్వవిద్యాలయ అధికారులు ఆకాంక్షించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏ.టి. యాదవ్ నియామకం

- శాబాష్‌పల్లి సర్పంచ్‌కు జిల్లా స్థాయి గౌరవం
- గ్రామాభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపు
- గ్రామాభివృద్ధి కోసం నిరంతర కృషి చేసిన నాయకుడు
- సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న ఎ.టి. యాదవ్
- నియామకంపై గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషులు, నాయకుల హర్షం
- జిల్లాలో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం



రాజన్న సిరిసిల్ల జిల్లా /మార్చ్ 16 / ( జన సంఘర్షణ )

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం శాబాష్‌పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఎ.టి. యాదవ్‌ను జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమాకం అయ్యారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల జిల్లాలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాబాష్‌పల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామ ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఆయన చురుకుగా పనిచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా ఆయన మంచి పేరు సంపాదించుకున్నారు. జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమితులైన ఎ.టి. యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలోని సర్పంచుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయించడం తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచుల ఐక్యతను పెంపొందిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానని, గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానని ఆయన తెలిపారు. ఈ నియామకం ద్వారా జిల్లాలోని సర్పంచులకు ఒక బలమైన వేదిక ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఎ.టి. యాదవ్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా శాబాష్‌పల్లి గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో జిల్లాలోని గ్రామపంచాయతీలు మరింత అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ పరిక్షల ఫీ నోటిఫికేషన్ విడుదల




డిచ్ పల్లి: మార్చి 16జన సంఘర్షణ

తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ పరీక్షల ఫీ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. యూజీ, సీబీసీఎస్ 02, 04, 06 సెమిస్టర్ రెగ్యులర్ 01, 03, 05 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష లకు సంబంధించిన ఫీ నోటిఫికేషన్ విడుదలైనదని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె. సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 17 నుండి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని తర్వాత అపరాధ రుసుముతో చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచినట్లు ఆయన పేర్కొన్నారు.

# వర్నిలో అంగన్వాడీ టీచర్ల అరెస్ట్




బోధన్ : మార్చి 16జన సంఘర్షణ

వర్ని మండలంలో ఛలో హైదరాబాద్ కార్య క్రమానికి వెళ్తున్న అంగన్వాడీ టీచర్లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మండల అంగన్వాడీ అధ్యక్షురాలు మంగాదేవి ఈ విషయాన్ని తెలిపారు. సమస్యల పరిష్కారం కోరితే అక్రమ అరెస్టులు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని, అరెస్టులతో తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.అంగన్వాడీ టీచర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ఓ పక్క నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ఐసిడిఎస్ లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు వేతనాలు పెంచకపోవడాన్ని సిపిఎం పార్టీ తప్పుపడుతుంది. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నాం. శ్రామిక మహిళలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం పార్టీ నవీపేట్ మండల కమిటీ సభ్యులకు పేర్కొన్నారు.

# బీబీ పేటల పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

మార్చ్ 16 (జన సంఘర్షణ)




బీబీపేట మండలంలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మన తెలుగు ఉమ్మడి రాష్ట్రాలు సంపాదించిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవి క్లబ్ బీబీపేట ఆవరణలో స్వర్గీయ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పొట్టి శ్రీరాములు అమర నిరాహార దీక్షతోనే ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని ఆయన చేసిన దేశభక్తి సేవలను త్యాగాన్ని పలువురు జయంతి సందర్భంగా గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని వాసవి క్లబ్ అధ్యక్షుడు మురికి శ్రీనివాస్ ఇంటి ముందు “చలివేంద్రం” ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షుడు మురికి శ్రీనివాస్, కార్యదర్శి రెడ్డి శెట్టి శ్రీనివాస్, కోశాధికారి జుర్రిగల శ్రీనివాస్, వైస్ గవర్నర్ బాసెట్టి నాగేశ్వర్, జోన్ చైర్మన్ తొడుపునూరి నాగభూషణం,ఈదుద్దల విశ్వప్రసాద్, రెడ్డిశెట్టి వెంకటేశం, నీలబైరయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీల అమలు చేయాలి..

ఎల్లారెడ్డి : మార్చ్ 16 (జనసంఘర్షణ)



రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక బిజెపి నాయకులు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సోమవారం బిజెపి నాయకులు నయాబ్ తాసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు సరిగా అందడం లేదని వారు ఆరోపించారు. రైతుబంధు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఎందుకు సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బిజెపి నాయకులు మర్రి బాలకిషన్, పెద్దడ్ల నరసింహులు, సతీష్, వంగపల్లి కాశీనాథ్, కటికే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాకాసిపేట్ ఆరోగ్య కేంద్రంలో 366మందికి వైద్య పరీక్షలు...

బోధన్ : మార్చి 16 జన సంఘర్షణ




బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 366మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో జిల్లా ఉప వైద్యాధికారిణి సమత, ఆర్థోపెడిక్ వైద్యులు అంబిక, గైనికాలాజిస్ట్ హేమలత, జనరల్ ఫిజీషియన్ లక్ష్మి, పీడియాట్రిక్ అమిత, ఆప్తాల్మిక్ సంకీర్తన, డెంటల్ వినూత్న స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు, అవరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. వ్యాధిని బట్టి మందులను అందించిన్నట్లు ఆసుపత్రి వైద్యులు విఠల్ రాజు సోలంకి తెలిపారు.

## కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్షణ ఉద్యోగుల(ఎస్ఎస్ఏ) సమస్యలను వెంటనే పరిష్కరించాలి

❑ కలెక్టరేట్ ఎదుట (టీఎస్‌యుటిఎఫ్) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన




రాజన్న సిరిసిల్ల జిల్లా/మార్చ్ 16/ ( జన సంఘర్షణ )

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో , అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తాత్సార వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో మూడు దశలవారీ పోరాటం లో భాగంగా ఈ రోజు రెండవ దశ పోరాటం లో భాగంగా జిల్లా కలెక్టరేట్ ముందు (కేజీబీవీ) (యు ఆర్ ఎస్) ఎస్. ఎస్. ఏ. ఉద్యోగులు , టీ.ఎస్. యు.టి.ఎఫ్. నాయకులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు . ఈ సందర్భంగా టీ.ఎస్. యు.టి.ఎఫ్. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేందర్ రావు ,జంగిటి రాజు లు మాట్లాడుతూ కే.జీ. బీ.వీ . ఎస్ ఎస్ ఏ. ఉద్యోగుల సమ్మె కాలానికి వేతనం వెంటనే చెల్లించి ,ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని,హెల్త్ కార్డ్ లు జారీ చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని,రెగులర్ ఉద్యోగులతో సమానంగా సి ఎల్ లు వాడుకునే విధానం అమలు పరచాలని డిమాండ్ ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి అంబటి రమేష్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు ఇప్పపూల దేవేందర్, ఎండి ఖయ్యూం, బుర్ర ఉపేందర్, దేవరాజ్ శ్రీనివాస్, నగేష్, చందన్ కుమార్, నరేష్, రవి కిరణ్ ధనుంజయ్, తిరుపతి రాంప్రసాద్ లక్ష్మీపతి, సంతోషి, చైతన్య, మంగ జ్యోతి, జయంతి, సుజాత, ఎండి సలీం, రమేష్ పాల్గొన్నారు.

## నిజామాబాద్ ప్రజలు ఈ దిగువ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలి

❑ పోలీస్ కమిషనర్ వెల్లడి

నిజామాబాద్ సిటీ మార్చి 16 (జన సంఘర్షణ )




1)విగ్రహాల ప్రతిష్టాపన:- ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది.

2)శబ్ద కాలుష్యం నియంత్రణ:- ఎక్కువశబ్దంతో డి.జే లను ఏర్పాటుచేయరాదని , ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి.

3)ఊరేగింపులు, సభల నిర్వహణ:- ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి. జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి.

4)సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు:- మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్దతిని తప్పనిసరి పాటించాలి.

5)డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు:- డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపద్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ,ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.

6)నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండిఅప్రమత్తం:- జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్ పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ, అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయండి. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

7)" ఎ " సర్టిఫికెట్ ఉన్న సినిమాల వీక్షణం:- నిజామాబాద్ జిల్లాలో " ఎ " (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లను అనుమతించరాదు.

8)బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం:- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీదుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత, అసభ్యకరమైన ప్రవర్తనను ప్రదర్శిస్తున్నట్లు నివేధికలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలకు చికాకు, ఆటంకము కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుంది. కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేయడం జరిగింది.

ముఖ్యగమనిక :- పైన తెలియజేసిన నిబంధనలను ఎవ్వరయిన అతిక్రమించిన యెడల వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు / ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అధికార ఉత్తర్వులను జారీచేయడం జరిగింది. ఇట్టి ఉత్తర్వులు తేది:16-03-2026 నుండి తేది:-31-3-2026 వరకు అమలులో ఉంటుంది. కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించగలరు.

## రేపల్లెవాడలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. (జన సంఘర్షణ)




ఇల్లందు నియోజకవర్గంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ శారద, మాజీ సర్పంచ్ పోటు రవి, పూనం శ్రీరాములు, మూతి ముత్యాలు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి చల్ల సముద్రం మసీద్ సదర్ షేక్ తాజుద్దీన్, ఎండి ఇస్మాయిల్, అబ్దుల్ రజాక్, షేక్ మైనుద్దీన్, మౌల్ సాబ్ నిజాముద్దీన్, షేక్ షరీఫ్, మహమ్మద్ ఖాజా, మహమ్మద్ పాష , ముస్లిం మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ శారద సమక్షంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంజాన్ పండుగను శాంతి, సౌభ్రాతృత్వంతో జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

## మహనీయుడు అమరజీవి చిత్రపటానికి నివాళులు...

❑ ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి మార్చ్ 16 (జన సంఘర్షణ):



తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమ వారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఆ మహనీయుని త్యాగనిరతిని స్మరించుకున్నాము. ఈ సందర్భంగా ఒక కీలక నిర్ణయం తీసుకున్నాము.. వచ్చే ఏడాది పొట్టి శ్రీరాములు జయంతి నాటికి మన శ్రీకాళహస్తిలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఈ రోజు సగర్వంగా ప్రకటిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఆయన ఆశయాల సాధనలో మనమందరం భాగస్వాములవుదాం. ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## విట్టోలి తాండ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యేకు వినతి

ముధోల్, మార్చ్16 (జన సంఘర్షణ):




ముధోల్ మండలంలోని విట్టోలి తాండ గ్రామపంచాయతీ సర్పంచ్ రాథోడ్ కాంతారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామ అభివృద్ధి పనుల కోసం మాజీ ఎమ్మెల్యే గని కలిసి వినతి పత్రం సమర్పించారు. తాండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. గ్రామంలో గ్రామపంచాయతీ కొత్త భవనం, వివో భవనం, అంగన్వాడి కొత్త భవనం నిర్మాణం, అలాగే రాజు తాండ గ్రామంలోని హనుమాన్ దేవాలయం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే విట్టోలి తాండలో వివో భవనం, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, అంగన్వాడి కొత్త భవనం శాంక్షన్ చేయించామని తెలిపారు. అలాగే రాజు తాండలో కొత్త మందిర నిర్మాణానికి దేవాదాయ శాఖ మంత్రితో మాట్లాడి త్వరలోనే ప్రొసీడింగ్స్ పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తండావాసులు మాజీ ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

కుప్పం,మార్చ్ 16 (జన సంఘర్షణ):




రంజాన్ పండుగను పురస్కరించుకుని కుప్పంలోని బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 150 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. బియ్యం పప్పు దినుసులు చక్కెర నెయ్యి కూరగాయలతో కూడిన ప్రత్యేక బ్యాగులను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి సంవత్సరం వివిధ సందర్భాలలో సేవా కార్యక్రమాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో విరివిగా కొనసాగిస్తున్నారు. బి.సి.ఎన్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండంపట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బీసీ నాగరాజు, సభ్యులు శాంత, డాక్టర్లు సునీల్ రాజ్, డాక్టర్ సాగర్ రాజ్, ముస్లిం సోదర కుటుంబాలు పాల్గొన్నాయి.

## నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం,మార్చ్ 16 (జన సంఘర్షణ):



దలవాయి కొత్తపల్లి సమీపంలో నూతన భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పూజా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కుప్పం శ్రీ వినాయక పెయింటర్ వర్కర్స్ సంఘం కు మునిసిపాలిటీ పరిధిలోని మోడ్రన్ కాలనీలో కేటాయించిన ప్రభుత్వ స్థలంలో సోమవారం నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఆ సంఘం సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ భవనం పూర్తి అయితే నియోజకవర్గంలోని పెయింటర్ కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి కార్మికుడికి అండగా ఎన్డీఏ ప్రభుత్వం ఉందని చెప్పడానికి ఇది ఒక మంచి నిదర్శనం. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సురేష్ బాబు ,సెల్వ రాజు, కన్నన్, దాము తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో ఘనంగా అమరజీవి జయంతి

◆ అమరజీవికి నివాళులర్పించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

కుప్పం,మార్చి 16 (జన సంఘర్షణ):



కుప్పంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం కుప్పం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి జయంతిని నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల సమర్పించి, అమరజీవి పొట్టి శ్రీరాములు అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సతీష్ కుమార్, రమేష్, గోపి, మూర్తి, సాయినాథ్, మంజునాథ్, సుశీల్, రాజు, ఆనంద్ కుమార్, మధు, మంజు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా అమరజీవి

◆ కడా పి.డి.వికాస్ మర్మత్.
◆ అమరజీవి చూపిన మార్గం మన అందరికీ ఆదర్శం.
◆ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.

కుప్పం,మార్చ్ 16 (జన సంఘర్షణ):

ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ అన్నారు. సోమవారం అమరచి మీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని అమరజీవికి ఘనంగా నివాళు లర్పించారు. పట్టణ నడి బొడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ..అమరజీవి చూపిన మార్గం మన అందరికీ ఆదర్శమన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రభుత్వ విప్ లు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర సాధనకై పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష, త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అమరజీవి పొట్టి శ్రీరాములుకు నేతల ఘన నివాళులు:మాజీ శాసన మండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని మాజీ శాసన మండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు ఆయనకు నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం జరిగిందన్నారు. జనసేన నేత డాక్టర్ సుభాష్: అమరజీవి పొట్టి శ్రీరాములుకు జనసేన నేత డాక్టర్ సుభాష్ నివాళులు అర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు భాషాపరుయుక్త రాష్ట్రాల పితామహుడు అని కొనియాడారు. టిడిపి రూరల్ అధ్యక్షుడు: కుప్పం రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి: జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సాంబశివం అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. కుప్పంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ బాబు, రాజ్ కుమార్, వెంకటేష్ ,దామోదర్ నాయుడు, జాకీర్, వేణు గోపాల్, ఆర్.ఆర్.రవి, వేలు, ఎం.ఆర్. సురేష్, కె.కన్నన్,



సెల్వరాజు, సోమశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కడా పిడి వికాస్ మర్మత్

కుప్పం,మార్చ్ 16 (జన సంఘర్షణ):



కుప్పంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సోమవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తాం

మార్చి 16 కార్వేటినగరం (జన సంఘర్షణ):



కార్వేటి నగరంలో ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారమాగాన్ని చూపుతామని తహశీల్దార్ నాగరాజు తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల వద్ద నుంచి ఏడు ఫిర్యాదులు స్వీకరించారు. హేమాద్రి రెడ్డి సంబంధించి ఆర్ కే వి బి పేట రెవిన్యూ లెక్క దాఖలలో సర్వేనెంబర్ 226/3 3.18 సెంట్లు ,226/4 ఏ లో 1.42 సంబంధించి తన అనుభవంలో ఉన్న వాటిని ఆన్లైన్ లో నమోదు చేయాలని రీ సర్వే నందు పొందుపరిచి తదుపరి సదరు భూమిని రీ సర్వే చేయాలని కోరారు. అంతవరకు నిలుపుదల చేయాలని కోరారు. తహశీల్దార్ విఆర్ఓ కు ఆదేశాలు ఇస్తూ, ఈ భూమికి సంబంధించి విభేదాలు ఉందని పరిష్కరించేంతవరకు పెండింగ్లో పెట్టాలని ఆదేశించారు.

## మండల కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులు..

◆ ఎంపీడీవో సురేంద్రనాథ్.

తొట్టంబేడు మార్చ్ 16 (జన సంఘర్షణ):



మండల ఎంపీడీవో కార్యాలయం లో ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమ రణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయులు , అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని తొట్టంబేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. సురేంద్రనాథ్ అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. వారితో పాటు డిప్యూటీ ఎం.పి.డి.ఓ (ఎస్.జి ఎస్. డబ్ల్యూ) భార్గవ సత్యం, కార్యాలయ సిబ్బంది వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## విద్యార్థి అదృశ్యం

కేవీబీపురం,మార్చ్ 16 (జన సంఘర్షణ):




కేవీబీపురం మండలంలోని రాగిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై ఆ మండల పోలీస్ స్టేషన్ లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు వివరాలు..కేవీబీపురం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన చెంచయ్య పెద్ద కుమారుడు బి.చందు(14) రాగిగుంట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ ఉదయం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. బడికి పోయి ఉంటాడని భావించిన తల్లిదండ్రులకు చందు సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన పడ్డారు. చుట్టుపక్కల, సమీప గ్రామాల్లో, బంధువులు ఊర్లలో చందూ ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం రాత్రి విద్యార్థి తండ్రి చెంచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ సెల్: 9491074520, చెంచయ్య సెల్: 86393 32033 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## షర్మిల ఠాగూర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి మార్చ్ 16 (జన సంఘర్షణ):



పట్టణ మైనార్టీ మహిళా నాయకురాలు షర్మిల ఠాగూర్ కుటుంబంలో ఇటీవల చోటుచేసుకున్న విషాదం పట్ల మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షర్మిల ఠాగూర్ కుటుంబ సభ్యులు షేక్ ఫాతిమా,షేక్ మలాన్ ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, సోమవారం వారి నివాసానికి వెళ్లిన మధుసూదన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యం చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగతంగా తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా, మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీద్, సాగిరాభి, యువజన విభాగం అధ్యక్షులు శ్రీవారి సురేష్, జూమ్లేష, ఫజల్, గఫూర్, ఆరిఫ్, పట్టణ యువత అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, అమ్మపాలెం సిరాజ్, జిలాని, అస్లాం, ఫిరోజ్, గౌస్ బాషా, షఫీ, కరిముల్లా, రసూల్, గిరి, చింత రాజేంద్ర, మురళి, నాగరాజు, రవి, నారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్య, పరిశోధన, పరిపాలన రంగాల్లో అభివృద్ధికి కృషి

◆ ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య ఎల్.సి. మల్లయ్య బాధ్యతల స్వీకారం.

కుప్పం, మార్చి 16 (జన సంఘర్షణ):



ద్రావిడ విశ్వవిద్యాలయంలో విద్య పరిశోధన, పాలన రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ద్రావిడ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య ఎల్. సి. మల్లయ్య తెలిపారు. సోమవారం రాబిట్ ఆఫీస్ లో విద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య ఎల్.సి. మల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆచార్యులు ,సిబ్బంది, విద్యార్థుల సహకారం ఎంతో అవసరమన్నారు. అందరి సహకారంతో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని మరింత పురోగతిపతంలో నడిపిస్తామన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి కార్యాలయంలో ఆచార్య ఎల్. సి. మల్లయ్య (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు). సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, ఇతరులు పాల్గొని ఆచార్య ఎల్. సి. మల్లయ్యకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆచార్య ఎల్. సి. మల్లయ్య మాట్లాడుతూ, ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని విద్య, పరిశోధన, పరిపాలన రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, డీన్ ఎకడమిక్ అఫైర్స్ ఆచార్య కే.శ్యామల, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఆచార్య శ్రీదేవి, ఆల్ స్కూల్స్ డీన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

మార్చి 16 కార్వేటినగరం (జన సంఘర్షణ):

కార్వేటినగరం మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైంది. కార్వేటినగరం లో రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కత్తిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 424 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, దీనిలో నలుగురు గైర్హాజరైనట్లు చీఫ్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఎస్సై తేజస్విని తెలిపారు. గట్టి భద్రత మధ్య పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైంది. చీఫ్ గాయత్రీ దేవి, మోహనమ్మ, డిపార్ట్మెంట్ అధికారులుగా రమేష్ బాబు మునిరాజా వ్యవహరించారు.



# కందూరులో ముగిసిన గంగ జాతర

సోమల, మార్చి 16 (జన సంఘర్షణ):
మండల పరిధిలోని కందూరు గ్రామంలో గంగమ్మ జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ నాయుడుకు గ్రామస్తులు, టిడిపి నాయకులు, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. కందూరు గ్రామానికి విచ్చేసిన మధుసూదన్ నాయుడు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు , టిడిపి నాయకులు ఆయనకు పూలహారాలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయనున్న నాయకుడిగా మధుసూదన్ నాయుడిని వారు ప్రశంసించారు. ఆయన గ్రామానికి విచ్చేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయాలు, జాతరలు మన సంస్కృతి సంపదకు ప్రతీకలని అన్నారు. గ్రామాల్లో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి సంప్రదాయం ప్రకారం కుమ్మరి వారి ఇంటి నుండి అమ్మవారిని గ్రామ సావిడి వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామ పెద్దలు, భక్తులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారి జామున మహిళలు అమ్మవారికి సలిబిండితో చేసిన దీళ్లను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి సంప్రదాయం ప్రకారం దున్నపోతును సమర్పించి బలి ప్రసాదాన్ని గ్రామ పురవీధుల్లో వెదజల్లారు. గ్రామస్తులు ఈ ప్రసాదాన్ని స్వీకరించి శుభఫలితాలు కలగాలని ప్రార్థించారు. మధ్యాహ్నం నుండి గంగ జాతర కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.



ఈ సందర్భంగా జనసేన నాయకులు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రాత్రి ఆసాధాని వారు కళు ళపాటతో అమ్మవారిని జల్దికి పంపించే కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచుల సంఘ అధ్యక్షుడు యజశేఖర నాయుడు, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

- **ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా ప్రత్యేక నిఘా, పెట్రోలింగ్ ఏర్పాటు.**
- **పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు.**
- **జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.**

తిరుపతి/ మార్చి 16 (జన సంఘర్షణ):
సోమవారం ప్రారంభమైన ఎస్ఎస్సీ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్. తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరీక్షలు ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించబడేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లు వంటి నిషేధిత వస్తువులు తీసుకురాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేకంగా దృష్టి సారించారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు జారీ చేస్తూ పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షల సమయంలో ఎటువంటి అవకతవకలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడే వ్యక్తులను నియంత్రించి, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్, ప్రింటింగ్ దుకాణాలు తెరవకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు అనుకూలమైన ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీసు శాఖ పూర్తిగా స్థాయిలో భద్రత ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

- **పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.**

నెల్లూరు జిల్లా, (జన సంఘర్షణ):
నెల్లూరు వైసిపి సిటీ ఆఫీస్ లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులతో కలిసి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. వారి త్యాగ ఫలితంగానే ఈరోజు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. ఈరోజు పొట్టి శ్రీరాములు కృషి ఫలితంగానే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. నగర ఆర్యవైశ్య విభాగం అధ్యక్షులు జమిలి శ్రీనివాసులు, 16 డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్ రెడ్డి,జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రీత్ రెడ్డి, 3,4,9 16, డివిజన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, సంధాని, ధనుజా రెడ్డి, సగిలి జయ రామిరెడ్డి, వైసిపి నాయకులు ఉమా, కొండయ్య, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, మీరా పాల్గొన్నారు.



# ఎక్సైజ్ అధికారులకు కనిపించడం లేదా..?

- **పల్లెల్లో గుడుంబా రాజ్యం!**

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. ( జన సంఘర్షణ)
పల్లెల్లో గుడుంబా తయారీ యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూస్తూ చూస్తూ మూగనాటకం ఆడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామాల్లో బహిరంగంగానే గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గుడుంబా తయారీ కేంద్రాలు రోజురోజుకు పెరుగుతుండగా, యువత మద్యం బారిన పడుతూ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే ఈ అక్రమ వ్యాపారం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే గుడుంబా తయారీదారులు మరింత రెచ్చిపోతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రామ్ జీ వద్దు.. గాంధీ ముద్దు

శ్రీకాళహస్తి మార్చ్ 16 (జన సంఘర్షణ):



రామ్ జీని సవరించి మాహాత్మా గాంధీ పేరుతోటే ఉపాధి హామీ పథకం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ అధ్యక్షతన ఆ సంఘం తిరుపతి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. పథకానికి మతం రంగు పూసి గాంధీ స్థానంలో కొత్తగా విబిజి రాంజీ పేరుగా మార్చిందని ఆరోపించారు. ఏడాదికి వందరోజులు పని దినాలు కనిపిస్తున్నట్లు వ్యవసాయ కూలీలకు నమ్మబలికి బడ్జెట్లో నిధులు తగ్గించి, కూలీలకు ద్రోహం చేశారని విమర్శించారు. పాత పథకంలో సంవత్సరానికి ఇచ్చే నిధులలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం, కేవలం 10 శాతమే రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని తెలిపారు. అయితే దాన్ని 60:40గా మార్చి కేంద్రం పథకం నుంచి తప్పుకోవాలని చూస్తోందనీ, తద్వారా రాష్ట్రాలను అదే బాట పట్టించాలని యోచిస్తోందంటూ మండిపడ్డారు. ఉపాధి పథకాన్ని రక్షించుకునేందుకు వ్యవసాయ కూలీలంతా తిరగబడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏప్రిల్ నెల 29, 30 తేదీలలో సత్యవేడులో జిల్లా మహాసభలు, మే నెల 6, 7 ,8 తేదీలలో అమలాపురంలో రాష్ట్ర మహాసభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, అధ్యక్ష ,కార్యదర్శులు బాలకృష్ణ, దాసరి జనార్దన్, అంగేరి పుల్లయ్య, గురవమ్మ, రమణయ్య, రాజగోపాల్, శంకరయ్య, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జనతా సేవా మిత్ర కిరీటిరెడ్డికి దక్కిన అరుదైన గౌరవం

మార్చి 16, జన సంఘర్షణ:



ఎన్టీఆర్ ట్రస్ట్ 29వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులో నిన్న జరిగిన కార్యక్రమంలో శ్రీ జనతా సేవా మిత్రా హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కిరీటి రెడ్డి గారి సేవలను గుర్తించి సన్మానించడం జరిగినది. ఇందులో భాగంగా కిరీటి రెడ్డి మాట్లాడుతూ మరణం లేని మనిషి పేదల పాలిట దేవుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అలాంటి మహానుభావుడు కడుపున పుట్టి ఆయన మార్గంలో నడుస్తూ వేలాది మందికి అన్ని రకాలుగా తనదైన శైలిలో సేవ చేస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్, ముఖ్యంగా నారా భువనేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది. అలాగే ముఖ్యంగా భువనేశ్వరి చేతులు మీదుగా ఈ అవార్డు తీసుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నాను అని తెలియజేయడం జరిగినది. అలాగే ఈ అవార్డు నా రక్తదాతలకు శ్రీ జనతా సేవా మిత్ర సభ్యులకి డెడికేట్ చేస్తున్నాను. అలాగే 2019 నుండి ఇప్పటివరకు ఈ ఏడు సంవత్సరాలుగా మన తిరుపతిలో అన్నదానం. రక్తదానం. అనాధ శవాలకు అంత్యక్రియలు చేయడం. విద్య వైద్యం జంతు సంరక్షణ .చెట్ల సంరక్షణ. అవయదానంపై అవగాహన సదస్సు. నిరుపేదలకి ఉపాధి ఇలాగ ఎన్నో కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేసుకోవడం జరుగుతుంది దీనికి ముఖ్య కారణం. ఏమి ఆశించకుండా ప్రజల శ్రేయస్సు కోసం పేదవాళ్ళకి సహాయం కోసం గొప్ప మనసుతో నా వెంట నడుస్తున్న నా బలమైన శ్రీ జనతా సేవ మిత్ర హెల్పింగ్ హాండ్స్ సభ్యులు వాళ్ల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది అని మాట్లాడడం జరిగినది.

# ఆర్గానిక్ ఆహారం ఆరోగ్యానికి శ్రేయస్కరం

రామకుప్పం మార్చి 16 (జన సంఘర్షణ)



మారిన కాల పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్యంగా జీవించేందుకు ఆర్గానిక్ ఆహారం అంటూ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంలో పేర్కొన్నారు. సోమవారం రామకుప్పంలోని బజారు వీధిలో ఆర్గానిక్ ఆహార కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని ప్రజల కోసం ఆరోగ్యం విద్య జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు బంగారు కుటుంబాలుగా మార్చేందుకు తదితర వాటిపై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎన్టీఆర్ వైద్య సేవలు ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్గానిక్ ఆహారం వైపు ప్రతి ఒక్కరూ మగ్గుచూపితే ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ కార్యనిర్వాహక సభ్యులు పట్ట నారాయణ చారి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు, నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షులు చలపతి, మాజీ సర్పంచ్ పీవీ సీతాపతి క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాల పరిశీలన

కోరుట్ల జనసంఘర్షణ





శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల ల భవనాన్ని తరగతి గదులను సోమ వారం ఎంపీడీఓ వి.రామకృష్ణ తో కలిసి కోరుట్ల ఎంఈఓ గంగుల నరేశం పరిశీ లించారు. కోరుట్ల మండలంలోని ఐలా పూర్, సర్వరాజ్ పూర్, కల్లూరు మండల పరిషత్ పాఠశాలల శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం కల్లూరు, సర్వరాజ్ పూర్ పాఠశాలలోని ఒక్కొక్క తరగతి గదిని మరియు ఐలాపూర్ పాఠశాలలోని ఆరు తరగతులు కూల్చివేసేందుకు అనుమతి పొందినందున వాటిని కూల్చివేసి వాటి స్థానంలో నూతన తరగతి గదులు నిర్మాణం చేపట్టి విద్యార్థులకు అందుబా టులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ సర్పంచ్ రామకృష్ణ, సర్వరాజ్ పూర్ సర్పంచ్ రాజ్ కుమార్, కల్లూరు సర్పంచ్ చిట్నేని లత రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, కిష్టయ్య, నరహరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

## జగిత్యాల జిల్లాలో వెంటనే మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**- ఎంపీ అర్వింద్ ధర్మపురి**

**- జగిత్యాల జిల్లా కలెక్టర్కు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి లేఖ**

జగిత్యాల జనసంఘర్షణ:



జగిత్యాల జిల్లాలో రైతులు పండించిన మక్క పంటకు సంబంధించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్కు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి లేఖ రాశారు. జిల్లాలో ఈ సంవత్సరం పెద్ద ఎత్తున మక్క పంట పండిందని, అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) రూ.2400 ప్రకటిం చినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్కు రూ.1700 నుంచి రూ.1800 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. దీని వల్ల ప్రతి రైతు సగటున రూ.20,000 నుండి రూ.25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను ఆయన కోరారు. అలాగే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, మక్క కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు...

## రంజోల్లో ఘనంగా మృత్యుంజయ హోమం

జహీరాబాద్ జనసంఘర్షణ:



రంజోల్ రాజయోగి ఆశ్రమంలో న్యాల్కల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో ఘనంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ హోమం కన్నుల పండుగగా జరిగిం దని ఆయన పేర్కొన్నారు.హోమం ద్వారా ప్రజలకు ఆయురారోగ్యాలు, సమాజానికి శాంతి, సౌభాగ్యాలు కలగాలని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. వేద సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఇలాంటి యజ్ఞాలు, హోమాలు నిర్వహించడం అవసరమని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో రజక సంఘ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## డిస్టెన్స్ సర్టిఫికెట్లు జారీ - ఉద్యోగులకు ఊరట

**జహీరాబాద్ సమీప గ్రామాల ఉద్యోగులకు 13% హెచ్ఆర్ఏ**

**8 కి.మీ లోపు గ్రామాల ఉపాధ్యాయులకు లాభం**



జహీరాబాద్ జనసంఘర్షణ:

జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధి విస్తరణతో పట్టణ చివర నుంచి 8 కి.మీ లోపు ఉన్న గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 11 శాతం బదులు 13 శాతం హెచ్ఆర్ఏ వర్తించనుంది. ఇందుకు సంబంధించిన డిస్టెన్స్ సర్టిఫికెట్లను పీఆర్టీయూ టీఎస్ నాయకులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కార్యాలయాధిపతులకు అందజేశారు. పెరిగిన హెచ్ఆర్ఏను ఈ నెల బిల్లుతోనే క్లెయిమ్ చేసుకోవచ్చని జిల్లా అధ్యక్షుడు డా. తులసిరామ్ రాథోడ్ తెలిపారు.సంబంధిత అధికారులు డీడీఓ లాగిన్లో 11 శాతం హెచ్ఆర్ఏ స్థానంలో 13 శాతం హెచ్ఆర్ఏను నమోదు చేసి ఈ నెల బిల్లులు చేసుకోవచ్చని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు డా. తులసిరామ్ రాథోడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమేశ్ బానోత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హీరాలాల్ చవ్వాణ్, సతీష్ గౌడ్, పీఆర్టీయూ టీఎస్ నాయకులు శివరాజ్, వెంకటేష్, ఉపాధ్యాయులు పుష్పలత, ఓంకార్ స్వామి, జియా ఉద్దీన్, నరేష్, రుక్సానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఆటలకు తగిన క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పాలకులదే

**తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి**

ఉప్పల్ జనసంఘర్షణ

ఆటలకు తగిన క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పాలకులదేనని తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ సలహాదారులు ఆర్. వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సీ గ్రౌండ్స్ లో 12నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్) టోర్నీ 5వ రోజు వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సంధర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ సలహాదారులు ఆర్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత, విద్యార్థులు క్రీడల్లో ముందుకు రావాలంటే ప్రతి గ్రామం, పట్టణంలో సరిపడిన క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడం.అత్యవసరమన్నారు. కానీ ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో క్రీడా స్థలాల కొరత తీవ్రంగా




ఉందన్నారు. దీంతో యువతకు ఆటల పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ సరైన మౌలిక వసతులు లేక వారు వెనుకబడే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు . అలాగే డ్రగ్స్, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్ల నుండి యువతను దూరంగా ఉంచడంలో కూడా క్రీడలు కీలకంగా ఉంటాయన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు,అందువల్ల రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకుని ప్రతి మండలం, గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడా



మైదానాలు ఏర్పాటు చేయాలని, ఉన్న మైదానాలను పరిరక్షించాలని, యువతకు అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. యువత ఆరోగ్యకరమైన దిశగా ఎదగాలంటే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడిచి క్రీడారంగ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్,సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్,భగత్ సిం, మహేష్, భాను లతో పాటు 5 టీమ్ ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## తొట్టిపుంపు గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్' వైద్య శిబిరం

**-మొబైల్ ఎక్స్-రే ద్వారా 52 మందికి పరీక్షలు**

**- ముగ్గురికి క్షయ వ్యాధి అనుమానం**

అన్నపురెడ్డిపల్లి జనసంఘర్షణ:

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపుంపు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సున్నం సంఘవి, ఉప సర్పంచ్ కణితి ఆదినారాయణ ప్రారంభించారు.ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆధునిక మొబైల్ ఎక్స్-రే యంత్రం ద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలో మొత్తం 52 మందికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించగా, అందులో ముగ్గురిని ప్రాథమికంగా క్షయ వ్యాధి అనుమానిత కేసులుగా గుర్తించినట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు.ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు వారాలకు పైగా తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో స్వల్ప జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం పడటం లేదా ఛాతిలో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.అనుమానిత లక్షణాలు ఉన్న వారికి కళ్లె మరియు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరఫున ఉచితంగా చికిత్స మరియు మందులు అందజేస్తామని ఆమె తెలిపారు. అలాగే నిక్షయ్ పోర్టల్ ద్వారా క్షయ



వ్యాధి బాధితులకు పోషకాహారం కోసం ప్రభుత్వం ప్రతి నెలా వెయ్యి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం సంఘవి, ఉప సర్పంచ్ కణితి ఆదినారాయణతో పాటు వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, ఆరోగ్య సిబ్బంది ప్రకాశరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేష్, క్షయ వ్యాధి పర్యవేక్షకుడు వెంకట్, మొబైల్ ఎక్స్-రే సాంకేతిక నిపుణుడు సాయి కృష్ణ, ఆరోగ్య కార్యకర్త నాగజ్యోతి, ఆశా కార్యకర్తలు రాములమ్మ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**

జగిత్యాల జనసంఘర్షణ:

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను



మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా



మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం

## పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్**

కోరుట్ల రూరల్ జనసంఘర్షణ:



పశు పోషకులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 126 పశువులకు టీకాలు వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ చాడ సంతోష్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ పిట్టల రాజేశ్వరి శ్రీనివాస్, నాయకులు విఠల్ రవీందర్ రెడ్డి, బర్కం చిట్టిబాబు, పశు వైద్య సిబ్బంది దేవేందర్, యశ్వంత్, శేఖర్, ఆనంద్, ముక్తార్, పాడి రైతులు పాల్గొన్నారు...

## గడి గురుజుల ప్రాంతంలో "హై మాస్ట్ నేషనల్ ఫ్లాగ్" ను ఏర్పాటు చేయాలి

**- కోరుట్ల చైర్ పర్సన్,వైస్ చైర్మన్, మున్సిపల్ కార్యాలయం కు 28వ వార్డు కౌన్సిలర్ కొక్కెర వెంకటేష్ వినతి**

కోరుట్ల జనసంఘర్షణ కోరుట్ల పట్టణంలోని 28వ వార్డులో గల చారిత్రక కట్టడం "గడి గురుజుల" వద్ద భారీ జాతీయ జెండాను ( హై మాస్ట్ నేషనల్ ఫ్లాగ్ ) ఏర్పాటు చేయాలని 28వ వార్డు కౌన్సిలర్ కొక్కెర వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ కార్యాలయంకు, మరియు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ మహ్మద్ షాహిద్ లను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఇటీవల మున్సిపల్ సాధారణ సమావేశంలో పట్టణ గౌరవార్థం ఒక చోట అత్యంత ఎత్తైన జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని ఎజెండాలోని 20వ అంశంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, జెండాను ఏర్పాటు చేయడానికి గడి గురుజుల ప్రాంతమే అత్యంత అనువైనదని వెంకటేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొక్కెర వెంకటేష్ మాట్లాడుతూ..."కోరుట్ల పట్టణ చరిత్రలో గడి గురుజులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇప్పటికే గడి గురుజులు జాతీయ జెండా రంగులతో అలరారుతూ ప్రజలను ఆకట్టుకుంటోంది.

## వెంకటేశ్వర కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ జనసంఘర్షణ :**





ఉప్పల్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కాలనీ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో నేరాలను తగ్గించడంలోనే కాకుండా ప్రజల్లో భద్రతా భావనను పెంపొందిం చడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని పేర్కొన్నారు. కాలనీ వెల్ఫేర్ సంఘం ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు పరిసర ప్రాంతాల్లో జరిగే అనుచిత కార్యకలాపాలను గుర్తించడంలో సహాయపడతాయని, ప్రజలు సురక్షితంగా జీవించేందుకు ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కాలనీ వాసులను ఆమె అభినందించారు. మన ప్రాంతం ఎల్లప్పుడూ శాంతి భద్రతలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నంగి శ్రీనివాస్, ఖజాంచి మిట్టపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిర్వహణ కార్యదర్శి జక్కుల సంపత్, విజయేంద్ర రాజు, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు పంపిణి చేసిన మందముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ జనసంఘర్షణ :**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ అలీ అబూ తాలిబ్ మసీదు వద్ద ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ తూఫాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. రంజాన్ మాసం ఉపవాసం, ప్రార్థనలు, దానం, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వంతో కలిసి జీవించడం ఎంతో అవసరమని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రంజాన్ పండుగ మానవత్వం, ప్రేమ, సహనం మరియు సేవా భావాన్ని ప్రతిబింబించే పండుగగా నిలుస్తుందని పేర్కొంటూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధన్పాల్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి అనీఫ్, వసీం సాబ్, ఎండి కబీర్, ఎండి బాబా, ఎండి ముజాహిద్, ఎండి రహమతుల్లా, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఎస్.వి. కిట్టు, కోయగూర బాలరాజ్, దంతూరి రాజు గౌడ్, మక్తాల బాలరాజ్, టిల్లు ముదిరాజ్, జానీ, భాయ్ ముజిబ్, సురేష్, జయంత్, టిల్లు, సాయి, వినేష్ తదితరులు మరియు మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**కొత్తగూడెం జనసంఘర్షణ**

అశ్వారావుపేట(నియోజకవర్గం), దమ్మపేట(మండలం), గొర్రెగుట్ట (గ్రామం) లో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి స్వ యంభూః క్షేత్రము ఏకాదశ 11వ వార్షికోత్సవం సందర్భం గా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అశ్వారా వుపేట నియోజ కవర్గ మాజీ ఎమ్మెల్యే బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు, ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ వారు మెచ్చా ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పైడి లక్ష్మణ్ రావు, ఓబులు సత్యనారాయణ, ధనేకుల కృష్ణారావు, యలమంచి రమణ రావు, తాటి ప్రదీప్ చంద్ర, మండల బి ఆర్ ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మండవ సత్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్పై అమెరికా,ఇజ్రాయెల్ దురాక్రమణ దాడి ఆపాలి

**-సామ్రాజ్యవాద దాడులను ప్రపంచ ప్రజలు ప్రతిఘటించాలి**

**-అమెరికా సామ్రాజ్యవాదం విధానాలు ప్రపంచానికి తీవ్ర విఘాతం**

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్**

**ఉప్పల్ జనసంఘర్షణ :**

సామ్రాజ్యవాద దురాక్రమనే లక్ష్యంగా ప్రమాదకరకంగా అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయిల్ దేశ అధ్యక్షుడు నేతన్యాహు జియోనిస్ట్ కూటమి వ్యవహరిస్తూ ఇరాన్పై దాడి చేయడం అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన అని, తక్షణమే యుద్ధాన్ని ఆపి, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ లో ప్లకార్డులు చేతబూని నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి మరియు మానవత్వం కోసం యుద్ధం కాకుండా సంభాషణలు, రాజదౌత్యం మాత్రమే మార్గమని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించిందన్నారు. అయినప్పటికీ ప్రపంచంలోని సామ్రాజ్యవాద శక్తులు అమెరికా, ఇజ్రాయిల్ తమ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు మధ్యప్రాచ్య దేశాలను యుద్ధ వేదికగా మార్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇరాన్పై యుద్ధ వాతావరణం



సృష్టించడం కూడా అదే విధమైన ప్రమాదకర ధోరణికి నిదర్శనమన్నారు. యుద్ధం ఎప్పటికీ సాధారణ ప్రజలకు మేలు చేయదని,యుద్ధం వల్ల కార్మికులు, రైతులు, పేద ప్రజలు, మహిళలు మరియు పిల్లలే అత్యంత భయంకరమైన నష్టాన్ని ఎదుర్కొంటారన్నారు. గతంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో జరిగిన యుద్ధాల వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు, కోట్లాది మంది తమ నివాసాలను వదిలి వలసబాట పట్టాల్సి వచ్చిందని . అలాంటి విషాదకర పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకూడదన్నారు. ప్రపంచ దేశాల మధ్య ఉన్న విభేదాలను యుద్ధం ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నించడం అంతర్జాతీయ శాంతికి తీవ్రమైన ముప్పు అని . ఆయుధ శక్తి ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం ప్రపంచాన్ని మరింత అస్థిరత వైపు నడిపిస్తుందన్నారు. అందుకే సమస్యల పరిష్కారానికి చర్చలు, పరస్పర గౌరవం, అంతర్జాతీయ చట్టాల పాటింపు అవసరమన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచంలోని కార్మిక వర్గం, ప్రజాస్వామ్యవాద శక్తులు, శాంతి ప్రియులు ఐక్యంగా గళం వినిపించాలన్నారు . యుద్ధాన్ని ప్రోత్సహించే రాజకీయాలను ఖండిస్తూ ప్రపంచ శాంతి కోసం ప్రజలు పోరాటం చేయాలని ఏఐవైఎఫ్ పిలుపునిస్తోందన్నారు. ఇరాన్ పై యుద్ధం జరుగుతుంటే మన దేశ ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత విదేశాంగ విధానంలో లోతైన సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుందన్నారు . డొనాల్డ్ ట్రంప్ నిర్దేశించిన అనుమతి మరియు సమయపాలనకు లోబడి రష్యాతో భారతదేశం యొక్క చమురు వాణిజ్యం అవమానకరమైన పరిస్థితితో సహా-వాషింగ్టన్ నుండి వచ్చే ఒత్తిడికి సమర్థవంతంగా తలవంచడం ద్వారా ప్రభుత్వం దేశం యొక్క సార్వభౌమ నిర్ణయాధికారంలో రాజీ పడిందన్నారు .ఇటువంటి విధేయతతో కూడిన దౌత్యం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై భారతదేశం యొక్క చారిత్రాత్మక నిబద్ధతను బలహీనపరుస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి. దామోదర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. ధర్మేంద్ర, సిపిఐ సీనియర్ నాయకులు టి. మల్కయ్య, సిపిఐ ఉప్పల్ మండల్ కార్యదర్శి టీ. సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏఐవైఎఫ్ మహిళ కన్వీనర్ జి .స్వప్న, సిపిఐ నాయకులు నారా నరసింహ, నరసింహారావు, కృపాకర్, నర్సింగరావు, సీనియర్ సిటిజన్ నాయకులు సాంబశివరావు, మల్లేష్, నాగేశ్వరరావు ఉప్పల్ నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ నాయకులు వికాస్ రెడ్డి, కౌశిక్, కరణ్, స్వాజిత్ రెడ్డి, శ్రీనివాస్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులందరికీ ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలి

**-కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట సిఐటియు నిరసన**

**-కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పణ**

**కీసర జనసంఘర్షణ :**

కీసర సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బంగారు నర్సింగ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసర సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల కార్మికులకు జీతాలు సమయానికి అందడం లేదని, గత నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటివరకు జమ కాలేదని తెలిపారు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కీసర సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, ఎంటామాలజీ, శానిటేషన్, ఫాగింగ్, ఎలక్ట్రిషన్, వాటర్ వర్క్స్ సిబ్బంది అందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక ఆందోళనలు, పోరాటాల ఫలితంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న సుమారు 302 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు ఉండేవని గుర్తు చేశారు. అయితే గత రెండు మూడు నెలలుగా ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు జమ కావడం లేదని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని, అధికారుల నిర్లక్ష్యం మరియు సమన్వయం లేకపోవడం వల్లే కార్మికులకు అందాల్సిన ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు అందడం లేదని విమర్శించారు. మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీనం అయిన తరువాత కార్మికుల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని అందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు అందేలా చూడాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.




కార్మికులందరికీ జిహెచ్ఎంసి జీతాలు అమలు చేయాలని, వారాంతపు సెలవులు మరియు జాతీయ పండుగల సెలవులు కల్పించాలని, మున్సిపల్ కిట్లు అందజేయాలని కోరారు. అలాగే కనీస వేతనాన్ని రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ మరియు కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాములమ్మ, కందెపెల్లి అశ్విని, నేతరి రాజేశ్వరి, శారద, లింగం గారి రాజశేఖర్, రేణుక, జ్యోతి, మాతమ్మ, ఎల్లమ్మ, పద్మ, నాగమ్మ, లక్ష్మమ్మ, సుగుణ, బాలమ్మ, రేణుక, పోచమ్మ, అనిత, నర్సమ్మ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలేను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన యువతి,
యువకులు కావలేను. సీనియర్‌లకు ప్రాధాన్యత ఇవ్వబడును



వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co